గంగమ్మ తల్లీ... కరుణ చూపవమ్మా...

- వేడుకగా గంగమ్మకు శాంతిఅభిషేకం



గంగమ్మ సేవలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: మొక్కులు తీర్చేము కరుణ చూపి...చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ భక్తులు సోమవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించి వేడుకున్నారు. జాతర సాంప్రదాయంలో భాగంగా పెద్ద గంగమ్మ, చిన్నగంగమ్మలకు ప్రతీకగా కైకాల కులస్తులు సోమవారం సున్నపు కుండలు వేషాలు ధరించి నగర వీధుల్లో విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు పూజలు చేసి ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వారం రోజుల పాటు విభిన్న వేషాలతో అలసిన గంగమ్మను శాంతిపజేసేందుకు సాంప్రదాయబద్ధంగాసోమవారం అర్ధరాత్రి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. ఇందులో భాగంగా అమ్మవారికి పాలు, పంచామృతం, నారికేళజలం, పసుపు నీరు వంటి అనేక సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం చేశారు.

నేడు 'పేరంటాల' వేషం

జాతరలో భాగంగా మంగళవారం కైకాల కులస్తులు పేరంటాల వేషం ధరిస్తారు. ఎర్రడల్లచీర ధరించి తలకు నల్లని గుడ్డ కట్టి ఒడిబాల కట్టుకొని బంగారంలా అట్టలతో చేసిన ఆభరణాలతో ముస్తాబైన పేరాంటాలు పంబల వాయిద్యాతో చాటు మండపం వద్ద పూజలు చేసి పురవీధులు విహరిస్తూ పూజలు అందుకుంటుంది. మంగళవారం వేకువజామున ఆలయానికి చేరుకొని చిన్నగంగమ్మ తర్వాత పెద్ద గంగమ్మ చెంప నరకడంతో జాతర సమాప్తమవుతుంది.

గంగమ్మ విశ్వరూప ప్రతిమ

తిరుపతి గంగజాతర మహోత్సవంలో భాగంగా చివరిరోజు రాత్రి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో విశ్వరూప ప్రతిమ కొలువు తీరనుంది. అలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడిస్తంబంపై ఈ అమ్మవారి విశ్వరూప ప్రతిమ రూపు దిద్దుకుంటుంది. కుమ్మరి, చాకలి, విశ్వబ్రాహ్మణ, కంసాలి, దళితులు, మంగలి, గొల్లవంటి అన్ని కులాల సమ్మేళన సమష్టి కృషితో అత్యంత భక్తి ప్రపత్తుల నడుమ భక్తులకు అమ్మవారి విశ్వరూప ప్రతిమ దర్శనం కలుగనుంది. వివిధ వేషాలు, వినోదాలు, పూజలతో సాగి గంగమ్మ చెంప నరకడంతో జాతర పరిసమాప్తమవుతుంది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రక్తపోటుపై అవగాహన సదస్సు

చంద్రగిరి: ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో బీపీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన ఎస్వీ మెడికల్ కళాశాల డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ.. అకాల మరణాలు సంభవించడంలో 30 శాతం వరకు బీపీ కారణం అవుతోందన్నా రు. బీపీ వలన గుండెపోటు, పక్షవాతం, కళ్లు, మూత్రపిండాలు దెబ్బతింటాయని వివరించారు. బీపీను నివానిరించడానికి, నియంత్రించడా నికి ఉత్తమమైన మార్గాలను ఆయన వివరించా రు. వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

అసలు దోషుల్ని పట్టుకోండి

తిరుపతి కల్చరల్: మహిళా వర్సిటీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడిలో తమవాళ్లు సుధాకర్‌రెడ్డి, హరికృష్ణలను పోలీసులు అన్యాయంగా ఇరికించి, జైలుకు తరలించారని వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో తిరుమలకు చెందిన సుధాకర్‌రెడ్డి సోదరి హరిత, హరికృష్ణ తల్లి భువనేశ్వరి మాట్లాడారు. హరికృష్ణ టీటీడీ లడ్డు కౌంటర్‌లో పని చేస్తాడని, సుధాకర్‌రెడ్డి పాపవినాశంలో షాపు నడుపుతున్నాడని తెలిపారు. తమ పిల్లలు స్కూటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తమవారిని విచారించి వదిలేస్తామని చెప్పిన పోలీసులు తమకు సమాచారం ఇవ్వకుండా వారిపై ఎఫ్ఐఆర్ కట్టి కడప జైలుకు తరలించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జరిగిన దాడి సంఘటనలో అసలు దోషులను తప్పించడానికి తమ వారిని బలి చేశారని వాపోయారు. నానిపై దాడి జరిగిన రోజున హరికృష్ణ తమిళనాడులో ఉన్నాడని, ఇందుకు సంబంధించిన ఆధారాలు, వీడియో ఫుటేజీలు ఉన్నాయని తెలిపారు. సుధాకర్‌రెడ్డి షాపులో వ్యాపారం చేసుకుంటున్నాడని సాక్ష్యాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు.

గంగమ్మకు చాంబర్ ఆఫ్ కామర్స్ సారె

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మకు సోమవారం సాయంత్రం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అత్యంత వేడుకగా సారెను సమర్పించారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో ముందుగా అనంతవీధిలో గంగమ్మ తల్లికి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. డాక్టర్ మేయర్ శిరీష, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సారె ఊరేగింపు

వైభవోపేతం... గోవిందుని గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీగోవిందరాజ స్వామి



శ్రీగోవిందరాజ స్వామివారి గరుడ సేవలో టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓలు, ఆలయ అధికారులు, అర్చకులు

తిరుపతి కల్చరల్: గోవింద నామస్మరణ నడుమ గరుడ వాహనదారుడైన శ్రీగోవిందరాజస్వామిని కీర్తిస్తూ భక్తులు గరుడ వాహన సేవను తిలకించి పులకించారు. శ్రీగోవిందరాజ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి గరుడ వాహన సేవ అత్యంత వైభవోపేతంగా సాగింది. స్వామివారి గరుడ సేవను పురస్కరించుకొని స్వామివారికి తిరుమల శ్రీవారి కానుకగా రూ.10 లక్షలు విలువైన ఆభరణాలను టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి సమర్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈఓ మాట్లాడుతూ తన అన్నగారైన శ్రీగోవిందరాజునికి తిరుమల శ్రీవారు రూ.10 లక్షలు విలువ చేసే మూడు ఆభరణాలైన వజ్రపోగులు, లక్ష్మీ కాసులమాల, తెల్లరాళ్ల పతకాన్ని బహూకరించారని తెలిపారు. అనంతరం సర్వాంగ సుందర రూపుడైన శ్రీగోవిందరాజస్వామి సకల వైభవంతో శక్తివంతమైన గరుడ వాహనంపై అధిరోహించి ఆలయ నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించి అనుగ్రహించారు. ఉదయం స్వామివారి పల్లకీ సేవ వేడుకగా సాగింది. స్వామివారు మోహినీ అవతారంలో పల్లకీలో కొలువై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల పీఠాధిపతులు, టీటీడీ జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు, ముఖ్య ఆర్థిక శాఖాధికారి బాలాజీ, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, డెప్యూటీ ఈఓ శాంతి, భద్రతాధికారి బాలిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: బాబు జగ్జీవన్‌రామ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయగిరి రఘు ఆధ్వర్యంలో సోమవారం వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ప్రతి ఏటా వేస వి సందర్భంగా వాకర్స్ సభ్యులకు ఉచితంగా మజ్జిగ పంపీణీ చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడా ది కూడా 300 మంది వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వాకర్స్ అసో సియేషన్ ప్రతినిధులు, వేణు రాయల్, దయాక ర్, రెడ్డెయ్య, మునిబాబు, వాకర్స్ పాల్గొన్నారు.

23న తుమ్మలగుంటలో క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి రూరల్: చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024 – 2025 క్రికెట్ సీజన్‌కు సంబంధించి మహిళా క్రికెటర్ల ఎంపిక ప్రక్రియను ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్ఆర్ క్రికెట్ మైదానంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. సీనియర్ (యువతులు), అండర్-19 (బాలికలు)కు ఎంపిక నిర్వహించనున్నారు. సీనియర్లకు ఎలాంటి వయోపరిమితి లేదని, అండర్-19 బాలికలకు మాత్రం 01-09-2005 నుండి 01-09-2009లోపు పుట్టిన వారు మాత్రమే అర్హులవుతారన్నారు. అలాగే అండర్-15కు ఎంపిక చేసే సమయానికి 01-09-2009 నుంచి 01-09-2013లోపు జన్మించిన వారు అర్హులుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక సమయంలో అండర్-19, అండర్-15 బాలికలు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తప్పకుండా తీసుకు రావాలన్నారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 8 గంటలకు తమ సొంత క్రీడా సామగ్రితోపాటు తెల్ల దుస్తులు ధరించి రావాలని సూచించారు. ఇతర వివరాలకు ఆర్కే మురుగన్ 98490 26131, చిన్నబాబు 79818 80381లను సంప్రదించాలని ఆయన సూచించారు.



కళాకారుల విన్యాసాలు తిలకిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

గంగమ్మకు మేయర్ దంపతుల సారె

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం మేయర్ డాక్టర్ శిరీష, వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముని శేఖర్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సారెను సమర్పించారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ ఆధ్వర్యంలో కళా బృందాల ప్రదర్శనలు, డప్పుల దరువుల మధ్య మేయర్ డాక్టర్ శిరీష ఇంటి వద్ద నుంచి సారె ఊరేగింపు కోలాహలంగా సాగింది. ముందుగా మేయర్ డాక్టర్ శిరీష ఇంటిలో అమ్మవారి సారెకు ఎమ్మెల్యే భూమన, డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. అనంతరం మేయర్ దంపతులు వేషాలమ్మకు కూడా సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్ ప్రవల్లికారెడ్డి, తులసీ యాదవ్, దేవదానం, శంకర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేష్, హేమంత్, వెంకటేష్‌రెడ్డి, చింతా రమేష్, మల్లంగుంట రవిచంద్రారెడ్డి, మస్తానమ్మ, బుసగాని లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, భక్తులు పాల్గొన్నారు.